క్లుప్తంగా

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ

మద్దిలపాలెం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ శ్యామూల్ డేవిడ్ రాజ్, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి పాల్గొన్నారు.

శివాజీపాలెంలో రేపు ఉచిత వైద్య శిబిరం

బీచ్ రోడ్డు: శివాజీపాలెంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సాధన సంస్థ చైర్మన్ ఈ.సత్యానంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్ సంబంధించిన వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శివాజీ పార్కు రోడ్డులోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్ వద్ద జరగనుందని తెలిపారు.

ఇంటి పంటలతో సంపూర్ణ ఆరోగ్యం



కేఎం రావు ఇంట్లో పండిస్తున్న పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ఇంట్లో పండించుకునే పంటల వినియోగంతో ప్రతి ఇంటా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని విశ్రాంత బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఆఫీసర్ కేఎం రావు అన్నారు. శుక్రవారం ఉదయం ఉషోదయ కూడలి సమీపంలో ఉన్న తన ఇంటి వద్ద ప్రకృతి ఆధారంగా పండిస్తున్న పెరటి పంటలను గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో విద్యార్థులు పరిశీలించారు. అక్కడ పండిస్తున్న పంటలను విద్యార్థులు వీక్షించడంతో పాటు వాటి ఎదుగుదలకు తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేఎం రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి సిద్ధంగా జీవించడం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

కూర్మన్నపాలెం: బైక్ అదుపు చేయలేక చెట్టుకు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన చింతలపాటి మోహన్‌కుమార్(33) పరవాడలోని ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. గురువారం జనరల్ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన మోహన్ అనారోగ్యం కారణంగా మధ్యాహ్నం అనుమతి తీసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాడు. రాత్రి స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. తిరిగి అర్ధరాత్రి సమయంలో అగనంపూడి నుంచి రాజీవ్‌నగర్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో తాను నడుపుతున్న బైక్‌ను అదుపు చేయలేక చెట్టును ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న భార్య స్రవంతి.. భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఐదు నెలల పాప ఉంది.

సందడిగా 'ఆడుదాం ఆంధ్రా'



అనకాపల్లి, సత్యసాయి జిల్లాల బాలికల మధ్య కబడ్డీ పోటీ



రసవత్తరంగా సాగుతున్న తిరుపతి, ఎన్టీఆర్ జిల్లాల మధ్య పురుషుల కబడ్డీ పోటీ

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు సందడిగా సాగుతున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానాలు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులతో కళకళలాడుతున్నాయి. ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో బాలికలు, బాలురకు సంబంధించి 10 మ్యాచ్‌లు జరిగాయి. ఏయూ జిమ్నాజియం మైదానంలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. వేర్వేరుగా ఏర్పాటు చేసిన ప్రాంగణాలలో ఏక కాలంలో పోటీలను ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహించారు. క్రీడల్లో పాల్గొన్న యువతలో ఆనందం వెల్లివిరిసింది. వాలీబాల్ ప్రాంగణం వెలుపల సాధన చేస్తూ క్రీడాకారులు సందడి చేశారు. క్రీడా పోటీలు జరుగుతున్న ప్రాంగణంలో పలుచోట్ల మంచినీటి సదుపాయం కల్పించారు. అదే విధంగా క్రీడాకారులకు నిర్వాహకులు బిస్కెట్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింక్‌లు పంపిణీ చేశారు. క్రీడా పోటీలు జరుగుతున్న ప్రాంతంలో ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. శాప్ సిబ్బంది పోటీలను పకడ్బందీగా నిర్వహించారు. పోటీలను వీడియో చిత్రీకరణ చేశారు. ఎప్పటికప్పుడు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది క్రీడా ప్రాంగణాల పరిసరాలను శుభ్రం చేశారు.



మైదానం వెలుపల సాధన చేస్తున్న బాలికలు



క్రీడాకారులకు బిస్కెట్లు, ఎనర్జీ డ్రింక్ పంపిణీ చేస్తున్న సిబ్బంది



మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

ఏఆర్ పోలీసులు ఎన్నికలకు సిద్ధం కావాలి



కైలాసగిరిలో ఏఆర్ పోలీసుల పరేడ్ పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ : ఈ ఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల విధులకు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు సిద్ధంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ జరుగుతున్న పరేడ్‌ను పరిశీలించి, సిబ్బంది నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి విధుల్లో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. డబ్బు, మద్యం, ఉచిత కానుకలు తరలింపును అరికట్టాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన డీఎస్పీ పి.నాగేశ్వరరావుకు ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రామకృష్ణారావు, వెంకటరావు, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారిణులకు జెర్సీల అందజేత



జెర్సీలు అందజేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించిన మహిళల జట్టుకు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ జెర్సీలను అందజేశారు. 18వ వార్డుకు చెందిన క్రీడాకారిణులు క్షేత్రస్థాయిలో జరిగిన పోటీల్లో విజయాలు సాధించి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వారిని ప్రోత్సహిస్తూ లాసన్స్ బే కాలనీలోని కార్యక్రమంలో జెర్సీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు 18వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన యూనిట్ టీం

అక్కిరెడ్డిపాలెం: సమగ్ర శిక్షలోని పార్ట్ టైం టీచర్లను ఒకేషనల్ టీచర్లుగా మార్పు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారని జిల్లా యూనిట్ టీం అధ్యక్షుడు రవిచంద్ చెప్పారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. 23 శాతం జీతం పెరుగుదల జీవో విడుదల చేసిన సందర్భంగా ఆయనతో పాటు యూనిట్ టీం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకర్, జిల్లా యూనిట్ టీం కార్యదర్శి కె.శ్రీనివాసరావు మంత్రిని కలిసి ధన్యవాదాలు చెప్పారు. ఉపాధ్యాయుల మిగిలిన అంశాలు కూడా త్వరలో పరిష్కరిస్తామని మంత్రి చెప్పినట్లు రవిచంద్ ఓ ప్రకటనలో తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతా సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ రైల్వే స్టేషన్‌లో భద్రతా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ రైల్వేలోని వివిధ విభాగాల్లో భద్రతా ప్రాముఖ్యం గురించి వివరించారు. భద్రత అనేది కేవలం నియమాల సమాహారం మాత్రమే కాదని, జీవిత విధానమని పేర్కొన్నారు. తమ తమ విధుల్లో ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు, క్రమశిక్షణను పాటించడం తమ బాధ్యతగా పరిగణించాలని సూచించారు. భద్రతలో నిబద్ధతతో తమ విధులను నిర్వర్తించిన పలువురికి ప్రశంసాపత్రాలను డీఆర్ఎం అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన్) ఎ.కె.మహరాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్ కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ, స్టేషన్ డైరెక్టర్ వెంకటపతిరాజు, ఆపరేషన్స్, సేఫ్టీ, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్, టెలికం, కమర్షియల్ విభాగాల అధికారులు, సీనియర్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ కౌన్సెలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆశ్రయం

అల్లిపురం: ఏయూటీడీ షెల్టర్‌లో వసతి పొందిన ముగ్గురు అభాగ్యులకు పెందుర్తి లయోలా హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. గతేడాది జూలై 17న కేజీహెచ్ సమీపంలో రోడ్డుపై దీనస్థితిలో ఉన్న సూర్య ప్రకాష్ అనే 65 ఏళ్ల వృద్ధుడికి దిశ పోలీసులు రక్షణ కల్పించి ఏయూటీడీ షెల్టర్‌కు అప్పగించారు. గతేడాది మార్చి 13న తక్కుస్ అనే 38 ఏళ్ల వ్యక్తిని ఏయూటీడీ సిబ్బంది గుర్తించి మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందజేశారు. అతడి ఆరోగ్యం మెరుగుపడటంతో షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న అక్కయ్యపాలెం వద్ద రామస్వామి అనే 70 ఏళ్ల వృద్ధుడిని ఫోర్త్‌టౌన్ పోలీసులు వసతి గృహంలో చేర్పించారు. వీరు ముగ్గురు కదలలేని స్థితిలో ఉండటంతో వారిని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించి ఆశ్రయం కల్పించారు.

14 నుంచి మహిళలకు ఉచిత యోగా శిక్షణ

ఆరిలోవ: మహిళలకు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రముఖ యోగా శిక్షకురాలు సులోచన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 24 వరకు డెయిరీ ఫారం సమీప లిటిల్ కిడ్స్ ప్లే స్కూల్‌లో ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటలు వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 12వ తేదీలోగా 94935 28285 నంబర్‌లో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విద్యుత్ విభాగం అధికారులు 33/11 కేవీ సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ, విద్యుత్ స్తంభాల తరలింపు పనులు చేపట్టనున్నందున శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కై లాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బీఎస్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

అంతరంగ దర్శనంతో ఆధ్యాత్మిక చైతన్యం



ప్రవచనాలు చేస్తున్న షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: సామవేదం షణ్ముఖశర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీ ఏబీసీ పార్కు వేదికగా శుక్రవారం కొనసాగాయి. హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ అంతరంగ దర్శనంతో ఆధ్యాత్మిక చైతన్యం సిద్ధిస్తుందన్నారు. శ్రీతులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానం పిల్లల నుంచి పెద్దల వరకు దేశమంతటా వ్యాప్తి చెందిందన్నారు. ఈ సందర్భంగా మానం లక్ష్మీ బృందం ఆలపించిన హనుమత్ కీర్తనలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖశర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

ఘంటసాల గానావధానం రేపు

సీతమ్మధార: ఈ నెల 11న గాన గంధర్వుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని టీపీటీ కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో సీతమ్మధార బృందావన్ పార్కులో ఘంటసాల గానావధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ రహమతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఘంటసాల పాటలతో వినూత్న కార్యక్రమం, లఘు నాటికలు జరుగుతాయని చెప్పారు.

యువతి అదృశ్యం



లావణ్య(ఫైల్)

బీచ్ రోడ్డు: ఓ యువతి అదృశ్యమైనట్టు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. పాత రేసపువానిపాలెంలో జి.భావని, శ్రీను దంపతులు తమ ఇద్దరి కుమార్తెలతో నివాసం ఉంటున్నారు. చిన్న కుమార్తె లావణ్య(19) ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తోంది. ఈ నెల 3న ఉద్యోగానికి వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. మొబైల్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తుంది. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలు శని, ఆదివారాల్లో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో జరుగనున్నాయి. రెండు రోజుల పాటు హయ్యర్ పరీక్షలతో పాటు వైవా జరుగగా ఆదివారం లోయర్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు గాను పూర్తిగా ఏర్పాట్లు చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా పంపిణీ చేశారు.

ఏయూ సమాచారమ్

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో జరుగుతున్న యూజీ, పీజీ పరీక్షల కేంద్రాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిసెస్ ఏవీఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధిపై పూర్వ విద్యార్థుల హర్షం



వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజినీరింగ్ 1977-82 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఎం.నాగేశ్వరరావు(సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆక్వాటెక్ యూఎస్ఏ), పి.గోపాల్(సీనియర్ సైబర్ సెక్యూరిటీ మేనేజర్ బ్రిస్టల్ మైయర్స్, యూఎస్ఏ) శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని మార్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీకి తమ వంతు సహకారం అందిస్తామని వీసీకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించండి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్

డాబాగార్డెన్స్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు విశాఖ వేదికగా నిర్వహిస్తుందని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో క్రీడలకు సంబంధించి ఏర్పాటు చేసిన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 13 వరకు పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్న క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఎందరో క్రీడాకారులు నగరానికి వస్తున్నందున వారికి స్వాగతం పలికే బోర్డులతో పాటు సదుపాయాలకు సంబంధించిన సూచిక బోర్డులు, హోర్డింగులు, బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అలాగే క్రీడాకారులకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సదుపాయం తదితర వాటిని ఏర్పాటు చేయాలని, మహిళా క్రీడాకారులకు ఆంధ్రా యూనివర్సిటీ మహిళా హాస్టల్లో ఏర్పాటు చేసిన వసతుల్లో ఎటువంటి లోపం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడును ఆదేశించారు. పర్యటనలో పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎంపీ ఎంవీవీ పాదయాత్ర



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు హారతి ఇస్తున్న 19వ వార్డు మహిళలు



22వ వార్డులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర శుక్రవారం 19వ వార్డులో ఉత్సాహంగా కొనసాగింది. ప్రజలు నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ 35వ రోజు 19వ వార్డులోని పెదజాలరిపేటలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా కృషి చేసిందన్నారు.

పాదయాత్రతో ప్రజా సమస్యల పరిష్కారం

బీచ్ రోడ్డు: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పాదయాత్ర చేపట్టినట్టు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 22వ వార్డులోని న్యూ రేసపువానిపాలెంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వం లక్ష్యమన్నారు. 35 రోజుల నుంచి చేస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఆర్పీ అదుపులో గంజాయి నిందితుడు

18.5 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో కలసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాయగడకు చెందిన సునంద అనే వ్యక్తి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని, 18.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.